# నారాయణ హై స్కూల్ శంకర్‌పల్లి విజయం గర్జన -- 100% ఫలితాలతో అద్భుత రికార్డ్

- నారాయణ విద్యార్థుల సత్తా -- టాప్ మార్క్ 584
580 పైగా 3 మంది, 550 పైగా 21 మంది, 500 పైగా 53 మంది ప్రతిభాపాటవం
- 90 మందిలో 90 మంది ఉత్తీర్ణత --
- నారాయణ స్కూల్‌కు ప్రత్యేక గుర్తింపు

**శంకర్‌పల్లి ఏప్రిల్ 30 భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి / చేవెళ్ల నియోజకవర్గం :-** శంకర్‌పల్లిలోని నారాయణ హై స్కూల్ ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో అగ్రస్థానాన్ని సాధిస్తూ ఘన విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 90 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఫలితాలతో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ ఫలితాల్లో టాప్‌గా 584 మార్కులు సాధించిన విద్యార్థి నారాయణ స్కూల్ ప్రతిష్ఠను మరింత ఎత్తుకు చేర్చాడు. అదేవిధంగా 580 పైగా 3 మంది, 550 పైగా 21 మంది, 500 పైగా 53 మంది విద్యార్థులు మెరుగైన మార్కులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ అద్భుత ఫలితాలకు నారాయణ హై స్కూల్ యాజమాన్యం,




ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల క్రమశిక్షణ ప్రధాన కారణమని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

# వైభవంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు..



**భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి:** పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన స్వయంభువు శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నరసింహ స్వామి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకారం, పుష్పాలంకారం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆశీర్వాదం తీసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా భక్తి వాతావరణం నెలకొంది.
కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, ఆలయ ప్రధాన అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డివిఆర్ శర్మ, దేవగిరి అనిల్ కుమార్, మత్తగజం నాగరాజు, ఆలయ పర్యవేక్షకులు కొత్తపల్లి వెంకటయ్య, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం శాస్త్ర గార్డెన్‌లో ఘనంగా వివాహ వేడుక

- నేతల సందడి... వధూవరులకు ఆశీస్సులు

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన**
ఇబ్రహీంపట్నంలోని శాస్త్ర గార్డెన్‌లో సభావత్ హంజా నాయక్ గారి కూతురి వివాహ వేడుక అత్యంత వైభవంగా, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది. సాంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించిన ఈ వివాహానికి బంధుమిత్రులు, అభిమానులు, వివిధ వర్గాల ప్రజలు భారీగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ శుభకార్యానికి కేతావత్ సుందర్ నాయక్, చందన్ నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని వధూవరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి సాంప్రదాయ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలో వారు వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. అలాగే రంగారెడ్డి జిల్లా జనసేన పార్టీ వీర మహిళ నాయకురాలు పుష్ప భాయి ప్రత్యేకంగా హాజరై



వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వివాహం అనేది రెండు కుటుంబాలను కలిపే పవిత్ర బంధమని, వధూవరులు పరస్పర అవగాహనతో జీవితం ముందుకు నడిపించాలని ఆకాంక్షించారు. శాస్త్ర గార్డెన్ ప్రాంగణం పూలతోరణాలతో అలంకరించి, సంగీత వాయిద్యాల నడుమ అద్భుతంగా ముస్తాబైంది. అతిథుల సందడితో కళకళలాడిన ఈ వేడుకలో సాంప్రదాయం, సంస్కృతి ప్రతిబింబిస్తూ ప్రతి క్షణం ఆనందభరితంగా మారింది. వివాహ వేడుకలో పాల్గొన్న అతిథులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేసి ఆతిథ్య సత్కారం చేశారు. ఈ సందర్భంగా హాజరైన అతిథులు వధూవరులకు ఆశీస్సులు అందజేస్తూ, వారి జీవితంలో ఐశ్వర్యం, ఆనందం, సుఖశాంతులు నిండాలని కోరుకున్నారు. మొత్తం మీద ఈ వివాహ వేడుక ప్రాంతంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, కుటుంబ సభ్యులకు, అతిథులకు మరపురాని జ్ఞాపకంగా మారింది. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బంధువులు మిత్రులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాలలో జడ్.పి.హెచ్.ఎస్ అంబటిపల్లి విద్యార్థుల ప్రభంజనం



**అచ్చంపేట: భవిష్యత్ ప్రజాపాలన జర్నలిస్టు జలగం సురేందర్:** విద్యార్థులకు, ఉపాధ్యాయ బృందానికి శుభాకాంక్షలు తెలిపిన గ్రామ సర్పంచ్ జంబుల శ్రీవాణి హనుమంత్ రెడ్డి. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షల ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించి ప్రభంజనం సృష్టించిన జడ్.పి.హెచ్.ఎస్ అంబటిపల్లి విద్యార్థుల, ఉపాధ్యాయ బృందం గురువారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు .. అనంతరం గ్రామ సర్పంచ్ జంబుల శ్రీవాణి హనుమంత్ రెడ్డి ని కలవడం జరిగింది.. ఈ సం దర్భంగా సర్పంచ్ విద్యార్థులకు, ఉపాధ్యాయ బృందానికి స్వీట్లు పంపిణీ చేసి, శుభాకాంక్షలు తెల పడం జరిగింది. అలాగే ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు మరియు ఉపా ధ్యాయ బృందానికి ఘనంగా సన్మానించడం జరిగింది. భవిష్యత్తులో మీరంతా, ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగ అవకాశాలు పొంది గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సర్పంచ్ ఆకాంక్షించారు.

# జర్నలిస్టులకు బిగ్ గిఫ్ట్: అక్రెడిటేషన్లలో తెలంగాణ రికార్డు





**హైదరాబాద్ :** తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి కొత్త దిశగా అడుగులు వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. సమాచార, ప్రజాసంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించిన వివరాలు మీడియా వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ మేరకు రాష్ట్రంలోని ప్రతి అర్హత గల జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డు అందించాలని ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మునుపటి ప్రభుత్వం 32,500 అక్రెడిటేషన్లకు అవకాశం ఉన్నప్పటికీ, కేవలం 23,352 మందికే పరిమితం చేసిందని మంత్రి విమర్శించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ పరిమితులను చెరిపేసి 46 వేల మందికి పైగా జర్నలిస్టులను అర్హులుగా గుర్తించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు. ఇప్పటికే సుమారు 2,800 కార్డులు ఆమోదం పొందినట్లు వెల్లడించారు. జర్నలిస్టుల సంఘాల సూచనల మేరకు ప్రభుత్వ ఉత్తర్వుల్లో మార్పులు చేసినట్లు పేర్కొన్న మంత్రి, అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రెడిటేషన్ ఇవ్వడంలో ఎలాంటి వెనుకంజ ఉండదని స్పష్టం చేశారు. మే 1 నుంచి అన్ని జిల్లాల్లో అక్రెడిటేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమవుతుందని, మే 10ను చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆ గడువులోగా వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి ఆమోదం తెలపనున్నట్లు చెప్పారు. జర్నలిస్టుల మొత్తం సంఖ్య ఖరారైన తరువాత ఆరోగ్య సేవలు, ఇతర సంక్షేమ పథకాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే ముఖ్యమంత్రి కీలక మార్గదర్శకాలు ఇచ్చినట్లు తెలిపారు. అదే సమయంలో, ఏప్రిల్ 30తో ముగియనున్న జర్నలిస్టుల బస్ పాసులను 15 రోజులు పొడిగిస్తున్నట్లు ప్రకటించి మీడియా వర్గాలకు ఊరటనిచ్చారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ జి. ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నలకు ప్రజా ప్రభుత్వం శుభవార్త...

**భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి:**
రైతులు పండించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ ట్రక్ షీట్ మరియు జిపిఎస్ విధానాల వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌లందరూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. రైతులు పడుతున్న ఇబ్బందులను సానుకూలంగా పరిశీలించిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కొత్త విధానాన్ని రద్దు చేసి, మునుపటి మాన్యువల్ ట్రక్ షీట్ విధానాన్ని తిరిగి అమల్లోకి తీసుకురావడం, అలాగే జిపిఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయడం జరిగింది. దీంతో ఇకపై



రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం విక్రయం మరింత సుల భతరం కానుంది. రైతుల సమస్యలను అర్థం చేసుకుని, వారికి అనుకూలంగా నిర్ణయం తీసుకుని పాత విధానాన్ని పునరుద్ధరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , రవాణా శాఖ మ ంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి , టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి రైతుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపించిన ప్రజా ప్రభుత్వానికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాము. రైతుల సంక్షేమం పట్ల వారి నిబద్ధత ప్రశంసనీయమైందని ఈ సందర్భంగా పేర్కొనడం ఆనందంగా ఉంది, అనిపాలకుర్తి చాకలి ఐలమ్మ మార్కెట్ చైర్పర్సన్ లావుడియా మంజుల భాస్కర్ నాయక్ తెలిపారు

# గ్రామీణ యువతకు ఆశాకిరణ

- ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రాల విస్తరణ
- ఆమనగల్‌లో ఐదవ శిక్షణ కేంద్రం ప్రారంభం


**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన**
గ్రామీణ యువత ప్రతిభకు తగిన అవకాశాల వేదికలను అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉచిత పోలీస్ శిక్షణ కార్యక్రమం మరింత విస్తరిస్తోంది. ఆమనగల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐదవ ఉచిత ఎస్సై ఉ కానిస్టేబుల్ శిక్షణ కేంద్రాన్ని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో కలలు కనే యువత ఉన్నప్పటికీ, ఆ కలలకు దారితీసే వేదికలు కొరవడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. “ప్రతిభ గ్రామాల్లో ఉంది... కానీ అవకాశాలు మాత్రం నగరాలకే పరిమితమవుతున్నాయి” అని పేర్కొన్నారు. తాను కూడా గ్రామీణ నేపథ్యం నుంచే వచ్చిన వ్యక్తినని, నిరుద్యోగ యువత ఎదుర్కొనే కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు, కోచింగ్ ఫీజుల భారాన్ని స్వయంగా అనుభవించానని గుర్తుచేశారు. డబ్బుల కొరత కారణంగా ఎవరి కలలు ఆగిపోకూడదనే సంకల్పంతో ప్రతి మండల కేంద్రంలో ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు నాలుగు మండలాల్లో విజయవంతంగా తరగతులు



నిర్వహిస్తూ, ఈ రోజు ఆమనగల్‌లో ఐదవ కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషకరమని చెప్పారు. ఈ కేంద్రాల్లో పాఠ్యాంశాల బోధనతో పాటు స్టడీ మెటీరియల్, శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, మానసిక ధైర్యం వంటి అంశాలపై సమగ్ర శిక్షణ అందించి, పూర్తి స్థాయి పోలీస్ అభ్యర్థులుగా తీర్చిదిద్దుతామని వివరించారు. అనంతరం మాట్లాడిన అతిథులు, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేపడుతున్న ఈ కార్యక్రమం సాధారణ శిక్షణ కేంద్రం కాదని, గ్రామీణ యువత జీవితాలను మలిచే మహత్తర యజ్ఞమని కొనియాడారు. ఫీజులు కట్టలేక వెనుకబడుతున్న పేద విద్యార్థులకు ఇది ఒక ఆశాకిరణంగా మారిందని అభిప్రాయపడ్డారు. ఈ కేంద్రం ద్వారా పెద్ద సంఖ్యలో యువత పోలీస్ ఉద్యోగాలు సాధించి, సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. శిక్షణ కేంద్రంలో చేరిన విద్యార్థులు కూడా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఇలాంటి కోచింగ్ సాధారణంగా ఖర్చుతో కూడుకున్నదని, అదే ఇప్పుడు తమ ప్రాంతంలో ఉచితంగా లభించడం గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించి కుటుంబాల ఆశలను నెరవేర్చుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎస్సై రాంరెడ్డి, సర్పంచ్ కళ్యాణ్, మాజీ ఎంపీటీసీ పంతు నాయక్, మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, ఉపాధ్యాయులు శేఖర్‌తో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్, దుడ్డు మల్లేష్, రవి నాయక్, శ్రీను, కృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దూదుచౌహాన్

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన** రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం అమనగల్ మండలానికి చెందిన ప్రముఖులు, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు, అమనగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ తల్లోజి గీత ఆచారి కుటుంబంలో వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఆమె కుమారుడు తల్లోజి భారత్ వివాహం నవ్య రెడ్డి గారితో అంగరంగ వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్ నగర పరిధిలోని సాగర్ రోడ్ సమీపంలో బొంగులూరు గేట్ వద్ద, ఓఆర్ఆర్ మన్నెగూడ ఎగ్జిట్ సమీపంలోని బీఎంఆర్ సార్థా కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, రాజకీయ నాయకులు, సామాజిక సేవకులు భారీగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ శుభకార్యానికి భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దూదు చౌహాన్ ముఖ్య అతిథిగా హాజరై వధూవరులకు ఆశీస్సులు అందజేశారు. ఆయనతో పాటు మైసిగండి సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సేవా సంఘం ఆర్గనైజేషన్ సెక్రటరీ జటావత్ జవహర్ లాల్ నాయక్, శంకర్ నాయక్, రెడ్యా నాయక్ తదితరులు పాల్గొని తమ శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, అభిమానులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని వధూవరులకు ఆశీస్సులు అందజేశారు. సభలో పలువురు నాయకులు మాట్లాడుతూ తల్లోజు కుటుంబం సామాజిక సేవలో



ముందుండి ప్రజలకు ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. సాంప్రదాయపు ఔన్నత్యంతో పాటు ఆధునిక అలం కరణలతో వేడుక ఆకట్టుకుంది. విందు వినోదాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆతిథ్య సత్కారం వేడుకకు మరింత శోభను చేకూర్చాయి. ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో పాల్గొని నూతన దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ నూతన వధూవరులు సుఖసంతోషాలతో, ఐశ్వర్య సమృద్ధులతో దీర్ఘాయుష్షుతో జీవించాలని ఆకాంక్షించారు. మొత్తం మీద ఈ వివాహ వేడుక ప్రాంతంలో విశేష ఆకర్షణగా నిలిచి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా మారింది. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పెద్దలు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రంగారెడ్డి డీఎంఅండ్ హెచ్ఓగా స్వర్ణకుమారి బాధ్యతలు

## -- కెఎన్ఆర్ సేవాదళం సత్కారం

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన**

రంగారెడ్డి జిల్లాకు నూతన డీఎంఅండ్ హెచ్ఓగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ స్వర్ణకుమారిని కెఎన్ఆర్ సేవాదళం ఘనంగా సత్కరించింది. గురువారం బాధ్యతలు చేపట్టిన అనంతరం, కెఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని డీఎంఅండ్ హెచ్ఓను కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో మరింత శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ స్వర్ణకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్య సేవల మెరుగుదల కోసం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతామని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాల విస్తరణ, వైద్య సిబ్బంది అందుబాటు, అత్యవసర సేవలను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన ఔషధాలు, పరికరాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు సమయానికి మెరుగైన చికిత్స అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా



డెమో అధికారి శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి అక్రమ్, ఏఓ షఫీతో పాటు ఇతర సిబ్బంది, సేవాదళ సభ్యులు పాల్గొన్నారు.

# నెల రోజులుగా మక్కలు కొనుగోలు చెయ్యడం లేదని సీపీఐ (ఎంఎల్ )పార్టీ ఆధ్వర్యంలో రైతుల ఆందోళన

- తహసీల్దార్ ఆఫీస్ ముందు బైఠయించి నిరసన.
- తహసీల్దార్ మార్కెట్ యార్డును సందర్శించే దాకా ఆందోళన.
- ఆర్డీఓ ఆదేశాల తో మార్కెట్ యార్డు ను సందర్శిన తహసీల్దార్ సరస్వతీ.
- పొంతన లేని సమాదాలతో దాటావేసిన మార్కెట్ యార్డు అధికారులు.
- ఇంకా 30 వేల క్వింటల్లా మక్కలు కంటా చేయాలనీ తహసీల్దార్ ఆదేశాలు.



**భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి ఏప్రిల్ 30:**
గడిచిన నెల రోజులుగా చిట్యాల ఐలమ్మ మార్కెట్ యార్డ్ పాలకుర్తి లో రైతుల మక్కలను కొనుగోలు చెయ్యకుండా జాప్యం చేస్తున్నారని అధికారల నిర్లక్ష్యనికి నిరసనగా గురువారం రైతులు సిపిఐ ఎం ఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు బైటయించి సుమారు 3 గంటల పాటు ధర్నా నిర్వహించారు. స్టేషన్ ఘన్ పూర్ ఆర్డీఓ వెంకన్న ఆదేశాల మేరకు తహసీల్దార్ సరస్వతి. ఆర్ ఐ తో కల్సి మార్కెట్ యార్డు ను సందర్శించారు. మార్కెట్ యార్డు లో సంబంధిత అధికారులు ఎవరు 11=00 గంటలైన లేకపోవడంతో తహసీల్దార్ డి సి సి బ్యాంక్ సీఈఓ పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఏప్రిల్ 8 వ తేదీ నుండి నేటి వరకు మక్కలు కాంటాలు పెట్టడం లేదని, కంటాలు పెట్టిన ధాన్యం గోదాం ల్లో కి తరలించేందుకు రైతులే గన్ని బాగ్స్, డి సి ఎం కిరాయిలు భరిస్తున్నామని తెలిపారు. ఇంకా ఒకటి, రెండు రోజుల్లో వర్షాలు వస్తే మక్కులు, మరియు మక్కా రైతుల పరిస్థితి అద్వాన్నంగ ఉంటుందని తహసీల్దార్ కు రైతులు మోర పెట్టుకున్నారు.

**మార్కెట్ యార్డు లో పోసిన రైతుల మక్కలను వెంటనే కొనుగోలు చేయాలి:**
**లేదా మార్కెట్ లో పోసిన మక్కలకు గ్యారంటీ ఇవ్వాలి**
**సీపీఐ ఎం ఎల్ లి బరేషన్ డిమాండ్...**

నెల రోజులు గా చాకలి ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ యార్డులో నిల్వ ఉంచిన మండలంలోని వివిధ గ్రామాల రైతులకు చెందిన రైతుల మక్కలను వెంటనే కొనుగోలు చేయాలనీ సీపీఐ ఎం ఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజు సాంబయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ నాయకులతో కలిసి మార్కెట్ యార్డు లో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులను తాసిల్దార్ కార్యాలయానికి సమీకరించి తాసిల్దార్ కార్యాలయం ముందు సుమారు మూడు గంటలకు పైగా బైఠాయించి సిబ్బందిని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి రైతులను, లిబరేషన్ నేతలను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నం చేశారు. దింతో రైతులు,లిబరేషన్ నాయకులు ప్రతిఘటించడం తో స్టేషన్ ఘన్ పూర్ ఆర్డిఓ ఆదేశాల మేరకు తాసిల్దార్ సరస్వతి మార్కెట్ యార్డ్ ను సందర్శించారు. మార్కెట్లో రైతులను పట్టించుకోకుండా నిర్లక్ష్యానికి గురి చేస్తున్న మార్క్ఫెడ్ అధికారులు, వ్యవసాయ మార్కెట్ అధికారుల చర్యలను ఈ సందర్భంగా తాసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు సిపిఐ ఎంఎల్ లివరేషన్ నేతలు. తాసిల్దార్ సరస్వతి డిసిసి బ్యాంకు సీఈవో సత్యనారాయణ ను మార్కెట్ యార్డుకు పిలిపించుకొని కొనుగోలు లో జరుగుతున్న జాప్యం గురించి ఆరా తీశారు. బ్యాంక్ అధికారులు మార్క్ఫెడ్ అధికారులు గన్ని బ్యాగులు పంపించడం లేదని కాంటాలు పెట్టిన మక్కలను గోదాముల్లోకి తరలిస్తుంటే గోదాముల్లో డిలీవరి చేసుకోవడం లేదని సత్యనారాయణ తహసీల్దార్ ద్రుష్టి కి తెచ్చారు. దీనితో తాత్సారం జరుగుతుందని తాసిల్దార్ కు చెప్పారు. మార్క్ఫెడ్ అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరా తీసుకొని వ్యవసాయ మార్కెట్లో కొనుగోలు సందర్భంగా కాంటాలు చేస్తున్న రైతులను మరింత మోసాల గురి చేస్తున్నారని సాంబయ్య అన్నారు. కాంటాలు జరిగిన రైతుల పేర్లు ఆన్లైన్లో నమోదు చేయించుటకు రైతుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని తాసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఇప్పటికే 77 వేల బస్తాలు కాంటాలు పెట్టినప్పటికీ ఇంకా 30 వేల పైచిలుకు క్వింటాళ్ల మక్కల ను వెంటనే కాంటాలు పెట్టి రైతులు మార్కెట్లో పోసిన మక్కలకు గ్యారెంటీ కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఒకటి రెండు రోజుల్లో వచ్చే వర్షాలకు మక్కలు తడిస్తే ప్రభుత్వ అధికారులే గ్యారెంటీ కల్పించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు జీడి సోమయ్య మహంకాళి శ్రీనివాస్ పార్టీ మండల కార్యదర్శి కొనుక్కటి కళింగరాజు బక్క నాగరాజు. బక్క సోమయ్య. జిట్టబోయిన సమ్మయ్య. బక్క గట్టుమల్లు. రమేష్. నాగరాజు. జిట్టబోయిన లక్ష్మయ్య.కత్తుల జోగయ్య. పొన్నాల యాకయ్య. తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ పదవీ విరమణ సన్మానోత్సవం - హాజరైన 16వ వార్డు కౌన్సిలర్ రుప్లా నాయక్







**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య** దేవరకొండ పట్టణంలోని సాయి శివ గార్డెన్‌లో గురువారం ఘనంగా జరిగిన పదవీ విరమణ సన్మానోత్సవంలో స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ శ్రీ యం. పూర్ణ చందర్ గారిని 16వ వార్డు కౌన్సిలర్ కేతావత్ రుప్లా నాయక్ ఘనంగా సత్కరించారు. సంవత్సరాలుగా వివిధ హోదాల్లో అంకితభావంతో పనిచేసి, ఎందరో మన్ననలు పొందిన పూర్ణ చందర్ గారు నేటితో పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ రుప్లా నాయక్, పూర్ణ చందర్ దంపతులకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పూర్ణ చందర్ గారు తన సుదీర్ఘ సర్వీసులో మున్సిపాలిటీ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారు. వారి శేషజీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను" అని రుప్లా నాయక్ పేర్కొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి'?

**-- రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు**
**-- మార్క్ ఫెడ్ అధికారులకు వినతిపత్రం అందజేత**



**ఖమ్మం రూరల్, ఏప్రిల్ 30 :** మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేయాలని తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చింతకాని, బోనకల్, వైరా, ఖమ్మం, రూరల్ మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో పెద్దతండా వద్ద గల మార్క్ ఫెడ్ కు చేరుకుని పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మార్క్ ఫెడ్ డీఎం శ్యామ్ కుమార్ కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ.. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి బస్తాలు తరలింపు కోసం అవసరమైన లారీలు అందుబాటులో ఉంచాలని, కౌలు రైతుల పేర్లు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని, గోదాములు దగ్గర దిగుమతి ఆలస్యం పేరుతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ మార్కెట్ గోదాములు యార్డులు ఉపయోగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో రెండు లక్షల ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేసి రాష్ట్రంలో ఎక్కువ దిగుబడి సాధించిందన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవని,నెల రోజుల నుంచి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. సమస్యలను త్వరగా పరిష్కరించకపోతే రైతు సంఘం ఆధ్వర్యంలో మంత్రుల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. సానుకూలంగా స్పందించిన మార్క్ ఫెడ్ డీఎం విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉఎస్‌కే. మీరా సాహెబ్, దొండపాటి నాగేశ్వరరావు, రావుల రాజాబాబు, ఉరడీ సుదర్శన్ రెడ్డి, కృష్ణ, చంద్ర వెంకట్రావు, వెంపటి వెంకటేశ్వరరావు, వీరయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

# గౌతంపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



**రుద్రంపూర్, ఏప్రిల్ 30 :** ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని వెంకటేష్ ఖని కోల్ మైన్ ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహారావు తెలిపారు. గురువారం సింగరేణి కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో ( ) వెంకటేష్ ఖని కోల్ మైన్ ప్రాజెక్టు ప్రభావిత పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా గౌతంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు గ్రామ ప్రజలకు రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) వంటి వ్యాధులపై పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం సింగరేణి సంస్థ ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తుందని అధికారులు తెలిపారు.

